నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 19 మే 2024 | SANGAREDDY

గ్రూప్-1కు ఏర్పాట్లు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ/ సిద్దిపేట అర్బన్/ సంగారెడ్డి కలెక్టరేట్, మే 18: గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ నోడల్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. కేటాయించిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్లు, నోడల్ అధికారులు పలుమార్లు సందర్శించి అన్ని సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ, హెల్త్, ట్రాన్స్‌కో, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలోని 21 పరీక్షా కేంద్రాల్లో 8,239 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలోని 10 కేంద్రాల్లో దాదాపు 4000 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, రూట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ... జిల్లాలో 9,672 మంది అభ్యర్థులకు 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. సీసీ కెమెరాలతో పాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆయా జిల్లాల పోలీస్ నోడల్ అధికారులు, అడిషనల్ డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

హరితహారం.. అభాసుపాలు

సిద్దిపేట జిల్లా మద్దూరులో విద్యుత్ అధికారులు నరికేసిన హరితహారం చెట్లు

హరితంపై నిర్లక్ష్యపు నీడ!

కానరాని సామాజిక భాగస్వామ్యం.. పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

మెదక్, మే 18(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో హరితహార కార్యక్రమం అభాసుపాలవుతోంది. ప్రతిఏడాది లక్ష్యం మేర హరితహారం మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ మాత్రం గాలికొదిలేస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో పీఆర్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. కానీ వాటి సంరక్షణ బాధ్యతలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. లక్షల మొక్కలు నాటాలనే సదుద్దేశంతో అధికారులే కాదు, ప్రజాప్రతినిధులు, అన్నివర్గాల ప్రజలు హరితహారం విజయవంతం కోసం శ్రమిస్తున్నారు. కానీ నాటిన మొక్కల నిర్వహణ నుపేక్షిస్తున్నారు. ఫలితంగా అవన్నీ నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఓ వైపు అధికారులు మొక్కలు నాటుకుంటూ వస్తుంటే.. మరోవైపు నీళ్లందక అవి ఎండిపోతున్నాయి.

2015లో హరితహారం ప్రారంభం...

హరితహారాన్ని 2015, జూలై 3న అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. 2016లో మెదక్ జిల్లా ఏర్పడిన తర్వాత 9 విడుతల్లో మెదక్ జిల్లాలో 6 కోట్ల మొక్కలు నాటారు. 2023 డిసెంబర్ 3న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హరితహారంలో నాటిన మొక్కల నిర్వహణ బాధ్యతను పూర్తిగా మర్చిపోయింది. దీంతో మొక్కలు ఎండిపోవడం, నాటిన మొక్కలకు ట్రీ గార్డులు బిగించిన పాపానపోలేదు.

కానరాని సామాజిక భాగస్వామ్యం

మొక్కలు నాటడంలో చూపుతున్న శ్రద్ధ వాటిని సంరక్షించడంలో లేదని వృక్ష ప్రేమికులు విమర్శిస్తున్నారు. లక్షల్లో మొక్కలు నాటుతున్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో వాటి ఆనవాళ్లు కనిపించడం లేదు. మొక్కల సంరక్షణ చర్యలు సరిగ్గా లేకపోవడంతో నాటిన కొద్దిరోజులకే మొక్కలు ఎండిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితం కనిపించడం లేదు. కేవలం మొక్కలను నాటడంతో తమ పనైపోయిందని అధికారులతోపాటు ప్రజలు భావిస్తుండడంతో పథకం లక్ష్యాన్ని చేరడం లేదన్నది నిజం.

'హరిత' విలాపం

మద్దూరు(ధూళిమిట్ట), మే 18: విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయనే నెపంతో విద్యుత్ అధికారులు హరితహారం చెట్లను నరికేసిన ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఓ వైపు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి హరితహారం కింద మొక్కలు నాటుతుంటే... ఆ మొక్కలు పెద్దవిగా పెరగగానే విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని అధికారులు నరికి వేస్తున్నారు. విద్యుత్ తీగలకు అడ్డువస్తే కేవలం కొమ్మలను తొలిగించాలి. కానీ పూర్తి స్థాయిలో పచ్చని చెట్లను నరకడంపై వృక్ష ప్రేమికులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- పిల్లలను సాకినట్లు సాకిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఎనిమిది విడుతల్లో పెద్దఎత్తున ప్లాంటేషన్
- నాటిన ప్రతి మొక్కనూ కాపాడిన కేసీఆర్ సర్కారు
- మొక్కలు ఎండుతున్నా పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- సిద్దిపేట జిల్లాలో రాజీవ్ రహదారి పక్కన చెట్లు కాలిపోతున్నా పట్టించుకోని అధికారులు
- చెట్లను కాపాడండి అంటూ.. ప్రభుత్వానికి ప్రకృతి ప్రేమికుల మొర

సిద్దిపేట, మే 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ హరితహారం కింద నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణ బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. కండ్ల ఎదుట హరితహారంలో మొక్కలు కాలిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పసిపిల్లలా సాకిన మొక్కలు నేడు నీళ్లులేక మోడువారి పోతున్నాయి. ఎనిమిదేండ్లుగా పెంచి పెద్దచేసిన చెట్లు ఇవాళ ఎండిపోయి కనిపిస్తున్నాయి. గ్రామాల్లో పచ్చని తోరణాలుగా స్వాగతం పలికిన చెట్లు నేడు ఎండిపోయాయి. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తుంది. గ్రామాల్లో, పట్టణాల్లో పల్లె ప్రకృతి వనాలు ఎండి పోతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల పరిస్థితి అంతంత మాత్రమే అని చెప్పాలి. ఎనిమిదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటా జూన్ వచ్చిందంటే పెద్దఎత్తున హరితహారం కింద మొక్కలు నాటేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకునే వారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తెలంగాణకు హరితహారంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాలో విరివిగా మొక్కలు నాటారు. ఎనిమిది విడుతల్లో 16.58 లక్షల మొక్కలను నాటారు. తెలంగాణ హరితహారంలో భాగంగా ఇరిగేషన్ ల్యాండ్, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇన్స్టిట్యూట్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ కింద ఈత మొక్కలు, నీలగిరి తదితర సుమారుగా 5 కోట్ల మొక్కలు నాటారు. వీటి సంరక్షణ బాధ్యత తీసుకొని ప్రతి మొక్కనూ కేసీఆర్ ప్రభుత్వం బతికించుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కడ చూసినా ఎండిన చెట్లు కనిపిస్తున్నాయి. రహదారుల కిరువైపులా ఎండిపోయిన, కాలిన చెట్లు కనిపిస్తున్నాయి. వారం రోజుల కిందట రాజీవ్ రహదారి పక్కన నాటిన మొక్కలు కాలి బూడిదయ్యాయి. ఇది ఎక్కడనో కాదు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ భవనానికి కూత వేటు దూరంలోనే.. నిత్యం ఇక్కడి నుంచి జిల్లా అధికారులు వస్తూ.. పోతూ ఉంటారు. కానీ ఈ విషయం వారికి కనిపించదు. రాజీవ్ రహదారికి ఇరువైపులా నాలుగు వరుసలా మొక్కలు నాటారు. వాటి సంరక్షణ కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది.

ఎండుతున్నా పట్టించుకున్నవారే కరువు

సిద్దిపేట జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం కింద మొక్కలను పెద్దఎత్తున నాటారు. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో హరితహారం కింద నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. మరికొన్ని చోట్ల చెత్తాచెదారాన్ని తగల బెట్టడంతో రోడ్డు పక్కన ఉన్న వందలాది మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అధికార యంత్రాంగం కళ్లెదుట జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొక్కలు నాటేందుకు, వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక కమిటీలు ఉన్నాయి. గ్రామ స్థాయిలో హరితరక్షణ కమిటీలు, మొక్కలు నాటడం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించేవి. గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, హరితరక్షణ కమిటీలు, యువతను భాగస్వామ్యం చేస్తూ హరితహారం కార్యక్రమాన్ని కేసీఆర్ ప్రభుత్వంలో విజయవంతం చేసి నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకున్నారు. రోడ్డుకిరువైపులా మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షించడం కోసం వార్డు వాచ్‌లను నియమించారు. మొక్కల సంరక్షణకు ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి ఒక్కటి కూడా కనిపించడం లేదు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి ఏటా మొక్కలను నాటారు. గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటడంతో పచ్చని తోరణాలు స్వాగతం పలికినట్లుగా ఉన్నాయి. వాటికి ఇప్పుడు సరిపడా నీరు లేక పోవడంతో ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో, అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటడానికి 23 రకాల మొక్కలను నాటి ఏపుగా పెంచారు. ప్రస్తుతం నీళ్లు లేక ఎండిపోతున్నా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

గ్రామాలు, పట్టణాల్లో నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు

సిద్దిపేట జిల్లాలో రాజీవ్ రహదారి పక్కనే (నాగుల బండ శివారులో) కాలిబూడిదైన చెట్లు

ఎండిన హరితహారం మొక్కలు

కాశేగుడిసెలలో ఎండిన హరితహారం మొక్కలు

చేర్యాల, మే 18: బీఆర్ఎస్ సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ఇప్పుడు పరిహాసమవుతోంది. మండలంలోని కాశేగుడిసెల గ్రామ పంచాయతీ పరిధిలో నాటేందుకు తీసుకువచ్చిన మొక్కలు ఎండిపోయాయి. స్థానిక పాఠశాల సమీపంలో ఎండిపోయిన మొక్కలు దర్శనం ఇస్తుండడంతో అటువైపుగా వెళ్లిన ప్రతిఒక్కరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హరితహారంపై నీలినీడలు

- నీళ్లు లేక ఎండుతున్న మొక్కలు
- చాలా గ్రామాల్లో నర్సరీలను పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా మొక్కల నిర్వహణ గాలికి...
- హరితహారం ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు

సంగారెడ్డి పట్టణంలో నీళ్లు లేక ఎండిన పార్కులోని హరితహారం మొక్కలు

సంగారెడ్డి జిల్లా గోపులారంలో దారిపొడవునా ఎండిపోయిన మొక్కలు

సంగారెడ్డి, మే 18(నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన హరితహారం కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యానికి గురవుతుంది. అంతరించిపోతున్న అడవుల విస్తీర్ణం పెంచడంతో పాటు గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు కేసీఆర్ సర్కార్ తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాలు, అడవులు అన్నిప్రాంతాల్లో మొక్కలు నాటేలా కేసీఆర్ సర్కార్ చొరవ తీసుకుంది. సంగారెడ్డి జిల్లాలో హరితహారం ద్వారా తొమ్మిది విడతల్లో 9.44 కోట్ల మొక్కలు నాటింది. దీంతో సంగారెడ్డి జిల్లాలో అడవులు విస్తీర్ణం పెరగడంతో పాటు గ్రామాల్లో పచ్చదనం పర్చుకుంది. ప్రజలతోపాటు ప్రకృతికి మేలు చేసే హరితహారం కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇస్తుంది. జిల్లాలో హరితహారం కింద నాటిన మొక్కల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఫలితంగా గ్రామాల్లో నాటిన మొక్కలతోపాటు నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం తీరును ప్రజలతోపాటు పర్యావరణవేత్తలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రజలు మేలుచేసే మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేసీఆర్ సర్కార్..హరితహారానికి పెద్దపీట

కేసీఆర్ సర్కార్ హరితహారానికి పెద్దపీట వేసి సంగారెడ్డి జిల్లాలో 647 నర్సరీలు ఏర్పాటు చేసింది. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు ఇండ్లల్లో పెంచేందుకు పూలు, పండ్ల మొక్కలను ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. 2015 నుంచి 2023 వరకు 10. 72 మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోగా 9.44కోట్ల మొక్కలను కేసీఆర్ సర్కారు పెంచింది.

కాంగ్రెస్ పాలనలో ఎండుతున్న మొక్కలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హరితహారం అటకెక్కిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. కానీ ఇప్పటివరకు అధికారులకు ఎలాంటి అదేశాలు ఇవ్వలేదు. దీంతో హరితహారం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరోవైపు హరితహారంలో నాటిన మొక్కల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసింది. దీంతో వేసవిలో నీళ్లులేక మొక్కలు ఎండిపోతున్నాయి. నర్సరీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. కమ్యూనిటీ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్, బయోఫెన్సింగ్ ప్లాంటేషన్, రోడ్‌సైడ్ ప్లాంటేషన్ పేరుతో 30 లక్షలకు పైగా మొక్కలు నాటింది. ఇందులో అవెన్యూ, రోడ్‌సైడ్, ట్యాంక్‌బండ్ ప్లాంటేషన్ పేరుతో గ్రామాలు, చెరువుల వద్ద నాటిన మొక్కలు నిర్వహణ లేక ఎండిపోతున్నాయి.

ములుగు: ఉద్యాన పంటల సాగు సమాచార బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, వర్సిటీ వీసీ నీరజా ప్రభాకర్, తదితరులు

నూతన వంగడాలు సృష్టించాలి

- ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి

ములుగు, మే 18 : మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఉద్యాన సాగులో నూతన వంగడాలకు శ్రీకారం చుట్టాలని ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో పరిశోధన, విస్తరణ, సలహామండలి సమావేశం నిర్వహించి విశ్వవిద్యాలయం చేపట్టిన పరిశోధన, విస్తరణ ఫలితాలను విశ్లేషించి వచ్చే సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించి వర్సిటీ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను మరింతగా విస్తరించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులను సైతం తట్టుకొని పంటలు పండేలా నూతన వంగడాలను సృష్టించాలన్నారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలతో రైతులకు రెట్టింపు ఆదాయం అందుతుందన్నారు. ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహాలను అందిస్తూ సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం రూపొందించిన ఉద్యాన పంటల సాగు సమాచార బ్రోచర్‌ను వర్సిటీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ నీరజాప్రభాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, ఆయా జిల్లాల ఉద్యానశాఖ అధికారులు, వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు, పలువురు ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

చేర్యాల ఏఎంసీ యార్డులో అరబెట్టిన తడిసిన ధాన్యం బస్తాలు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

చేర్యాల, మే 18: అన్నదాతలపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరో వైపు ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఎలాంటి వసతులు కల్పించకపోవడం అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. కొన్నిరోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో కాంటాలు వేయక రైతుల అక్కడే ఉంటున్నారు. రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో ధాన్యం కుప్పలపై టార్పాలిన్ షీట్లు కప్పేందుకు యత్నించిన్నప్పటికీ బలమైన గాలులు రావడంతో అవి కాస్తా కొట్టుకుపోయాయి. ధాన్యం తూకం వేసేందుకు రైతులు గోనే సంచుల్లో నింపిన బస్తాలు సైతం నానిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో రాత్రి వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టుకునేందుకు రైతులు పడ్డ బాధలు అంతాఇంతా కాదు. సంబంధిత శాఖ అధికారులు సందర్శించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కోనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తాగునీటికి తండ్లాట

- ఫిల్టర్‌వాటర్ కొనుగోలు చేస్తున్న ఆకునూరు గ్రామస్తులు

ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

చేర్యాల, మే 18: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో పది రోజులుగా పలు వార్డులకు చెందిన ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. 12వార్డులున్న గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు రెండు పెద్ద ట్యాంకులు ఉన్నాయి. గ్రామంలోని 7, 8, 9, 10, 11 వార్డుల ప్రజలు గ్రామ సమీపంలో ఉన్న వాగులో ఉన్న బోరు ద్వారా సరఫరా అయ్యే నీటిని తాగునీటి కోసం ఉపయోగిస్తారు. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నప్పటికీ గ్రామస్తులు పూర్వకాలం నుంచి వాగు నీటిని తాగుతున్నారు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం బోరుమోటార్ కాలిపోవడంతో పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి పట్టించుకోకపోవడంతో ప్రజలు తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేక ఆయా వార్డుల ప్రజలు ఫిల్టర్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. వాగు నుంచి శుద్ధ జలాలు తాగుతున్న ప్రజలకు ఫిల్టర్ నీళ్లు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం పంచాయతీ అధికారులు ట్యాంకర్ ద్వారా కొన్ని వార్డుల ప్రజలకు తాగునీటిని సరఫరా చేసినట్లు పలువురు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోయినప్పటికీ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.